# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 12

సోమవారం, 23 సెప్టెంబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## గోండి లిపి సృష్టికర్త జంగు మృతి



**నార్నూర్:** గోండి లిపి ఆవిష్కర్త, గోండి గుణింతాలు, గణిత సృష్టికర్త కోట్నాక్ జంగు(90) ఇక లేరు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుం జాలలోని నివాసంలో అనారోగ్యంతో ఆదివారం ఆయన కన్నుమూశారు. ఆదివాసీ గోండు చిన్నా రుల కోసం గోండి-తెలుగు వాచకాలను ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్రచురించి, వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారు.

## చిరంజీవికి విశిష్ట గౌరవం.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు..



**హైదరాబాద్:** నాలుగు దశాబ్దాలకుపైగా సినీ ప్రస్థానంలో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి. సినీ పరిశ్రమకు చేసిన సేవలకు - 2వ పేజీలో



# నిలబడతాం.. బలపడతాం

- మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు
- అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం
- శాంతియుతంగా సమస్యల పరిష్కారం
- భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు..
- సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు
- క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ
- ఇకపై సముద్రంలోనూ క్వాడ్.. కొత్తగా 'మైత్రి'
- ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్‌కు పైలట్ ప్రాజెక్టు
- 'విల్మింగ్టన్ డిక్లరేషన్'లో పాక్‌పై నిప్పులు
- మోదీపై జో బైడెన్ పొగడ్తల వర్షం



### మన భాగస్వామ్య బంధం బలమైనది

భారత్‌తో అమెరికా భాగస్వామ్యం ఎంతో బలమైనది, సన్నిహితమైనది. చరిత్రలో ఎన్నడూలేనంత గతిశీలమైనది కూడా. నేను, మోదీ ఎప్పుడు కలిసి కూర్చొన్నా సరికొత్త రంగాల్లో సహకారానికి ప్రయత్నిస్తుంటాం. ఈరోజు కూడా అదే జరిగింది.

- మోదీతో గంటసేపు చర్చల అనంతరం 'ఎక్స్'లో జో బైడెన్

### పరిపుష్టత దిశగా అడుగులు

పరస్పర ప్రయోజనకర అంశాల్లో భాగస్వామ్యాన్ని పరిపుష్టం చేసుకునే దిశగా చర్చలు ఎంతో ఫలప్రదంగా సాగాయి. నాకు చక్కని ఆతిథ్యం లభించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంతో పాటు ప్రపంచ దేశాల సంబంధిత విషయాలపైనా ఇరువురం అభిప్రాయాలు వ్యక్తం చేసుకున్నాం. - మోదీ

# అవినీతికి తావివ్వకండి..

## పోస్టింగుల విషయంలో జోక్యం వద్దు

- అవినీతికి తావివ్వకండి.. పోస్టింగుల విషయంలో జోక్యం వద్దు
- గత ప్రభుత్వంలో అలా చేయడం వల్లే ఓటమిపాలయ్యారు
- జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..
- 9 నెలల్లో ఒక్కరోజూ సెలవు తీసుకోకుండా పనిచేశా
- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం వ్యాఖ్యలు
- మహేశ్‌గౌడ్ నిబద్ధత వల్లే పీసీసీ చీఫ్ పదవి వరించింది



**హైదరాబాద్:** ఎమ్మెల్యేలంతా సమర్థంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పీసీసీకి కొత్త అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌ను నియమించినందుకు పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్‌ను సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా నేను సెలవు తీసుకోలేదు. ఇన్‌ఛార్జి మంత్రులు వారానికి రెండుసార్లు జిల్లాల్లో పర్యటించాలి. ప్రజల్లో ఉన్నవారికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులివ్వాలని పీసీసీకి సూచిస్తున్నా. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే జనాభాను - మిగతా 2వ పేజీలో

## దసరాకు 'కేబినెట్' ధమాకా!

- ప్రస్తుతం సీఎం సహా 11 మంది మంత్రులు..
- కొత్తగా మరో ఆరుగురికి అవకాశం
- వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పుడైనా విస్తరణ!
- విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. దసరా పండుగ సమయంలో కొత్త మంత్రులను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. కేబినెట్ విస్తరణకు అడ్డంకులు తొలగినట్టేనని, ఈసారి - మిగతా 2వ పేజీలో

# శ్రీలంక అధ్యక్షుడిగా దిస్సనాయకే

## మొదటి రౌండ్‌లో తేలని ఫలితం

### రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపొందిన అనుర కుమార

### విక్రమసింఘేకు మూడో స్థానం



**కొలంబో:** శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్ట్ జనతా విముక్తి పెరమున పార్టీ నేత అనుర కుమార దిసనాయకే (56) విజయం సాధించారు. ఆదివారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో దిసనాయకే అత్యధిక మెజార్టీ సాధించి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో 42.31 శాతం ఓట్లు అనుర కుమార సాధించినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రెండోస్థానంలో ఉన్న విపక్షనేత సజిత్ ప్రేమదాస(సమగి జన బలవేగాయా/ఎస్‌జేబీ)కు 32.76శాతం - మిగతా 2వ పేజీలో

# సిట్టింగ్ జడ్జితో విచారణ

## అమృత్ టెండర్లలో అక్రమాలపై కేటీఆర్ డిమాండ్

- తేదీ, సమయం చెబితే సీవీసీ దగ్గరకైనా వెళదాం
- అవినీతి జరగలేదని వారు తేలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోగస్ అని ధ్వజం


**హైదరాబాద్:** అమృత్ టెండర్లలో అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజ్ఞప్తి చేసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర విజిలెన్స్ కమిషనర్ దగ్గరికైనా వెళ్దామని అన్నారు. అమృత్ టెండర్లలో తప్పు జరిగిందని తేలిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. 'ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి



హైకోర్టు సీజే దగ్గరకి పోదాం. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించమని కోరదాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పు జరగలేదని అంటే.. నేను రాజకీయ సన్యాసం చేస్తా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి - మిగతా 2వ పేజీలో

## సింగరేణి, జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండం విద్యుత్ ప్లాంటు

### కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం




**హైదరాబాద్:** రామగుండంలో సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతో కొత్తగా థర్మల్ విద్యుత్ ప్లాంటును సింగరేణి, జెన్‌కోల సంయుక్త భాగస్వామ్యంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధి విధానాలను సింగరేణి సంస్థతో కలసి వారంలోగా రూపొందించాలని జెన్‌కోకు రాష్ట్ర ఇంధనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' (డీపీఆర్)ను నెలలోగా తయారు చేయాలని జెన్‌కోకు ప్రభుత్వం సూచించింది. రామగుండంలో ప్రస్తుతం జెన్‌కోకు 62.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు ఉంది. దీనికి కాలం చెల్లడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. అక్కడి ఉద్యోగులను ఖాళీగా ఉంచి జెన్‌కో జీతాలు చెల్లిస్తోంది. దాని స్థానంలో కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంటు నిర్మించి తమను అక్కడే కొనసాగించాలని వారు ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో - మిగతా 2వ పేజీలో

# ఉగ్ర కుట్రల్లో ఒవైసీ కాలేజీ ఫ్యాకల్టీ

- ఉగ్రవాదులను పెంచి పోషించేది ఎంఐఎం పార్టీనే
- తిరుపతి లడ్డూ కల్తీ.. హిందూ ధర్మంపై దాడి
- కాంగ్రెస్ సర్కారులో అవినీతి: బండి సంజయ్

**కరీంనగర్/హైదరాబాద్, సెప్టెంబరు 22:** ఉగ్రవాదులను పెంచి పోషించేది మజ్లిస్ పార్టీ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఒవైసీకి చెందిన కాలేజీలో పని చేసిన ఓ ఫ్యాకల్టీని ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడని గతంలో అరెస్టు చేశారని గుర్తుచేశారు. సెక్యులర్ అనే వాళ్లు ఏనాడైనా హిందువుల పండుగను జరుపుకొన్నారా..? అని ప్రశ్నించారు. ఆదివారం - మిగతా 2వ పేజీలో

## 8 ఎకరాల్లోని 44 నిర్మాణాలు

# కూల్చివేత

- మూడు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా
- కూకట్‌పల్లి నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లోని 16 షెడ్లు
- మరో రెండు చోట్ల సర్కారు భూమిలోని విల్లాలు..
- వివరాలు వెల్లడించిన కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్‌బీ కూకట్‌పల్లి, పటాన్‌చెరు:** రాజధానిలో చెరువులు.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా బుల్డోజర్లు ఆదివారం కూకట్‌పల్లి నల్లచెరువు, అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో తమ పనిచేపట్టాయి. రెండు రోజుల క్రితం డ్రోన్లతో సర్వే నిర్వహించిన అధికారులు అక్రమంగా భవనాలు, షెడ్లు నిర్మించిన వ్యక్తులకు తాఖీదులిచ్చి ఆదివారంలోపు ఖాళీ చేయకపోతే కూల్చేస్తామని హెచ్చరించారు. వారు స్పందించకపోవడంతో కూకట్‌పల్లి నల్లచెరువు, అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణమైన 25 విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు సహా 44 నిర్మాణాలను కూల్చివేశారు. షెడ్లు, - 2వ పేజీలో

## అటవీప్రాంతంలో విధ్వంసం ఆపాలి

### రాడార్ ప్రాజెక్టును మరోచోటుకు తరలించాలి: ప్రొ.కె.నాగేశ్వర్

**రాంనగర్:** వికారాబాద్ జిల్లా పూడూరు సమీపంలోని దామగుండం అటవీప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న రాడార్ నిర్మాణ ప్రాజెక్టును మరోచోటుకు తరలించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. దేశరక్షణ, అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని.. పర్యావరణాన్ని విధ్వంసం చేస్తామంటే మాత్రం ఊరుకోబోమని స్పష్టం చేశారు. 'సేవ్ దామగుండం.. సేవ్ హైదరాబాద్' నినాదంతో ఆదివారం - 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగొంతుక - మనస్వరం

హైదరాబాద్
సోమవారం, 23 సెప్టెంబర్, 2024

# కాళేశ్వరం వృథా కాదు..

## కాంగ్రెస్ ప్రభుత్వమే దానిని నిరూపించింది: హరీశ్‌రావు



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అదే ప్రాజెక్టు వ్యవస్థను ఉపయోగించుకుంటోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన మూడు పిల్లర్లను చూపుతూ మొత్తం ప్రాజెక్టు మీద రూ.లక్ష కోట్లు వృథా అయినట్లు ప్రజలను తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. ఇప్పుడు మల్లన్నసాగర్, ఇతర ప్రాజెక్టుల్లో నీటిని నింపుతూ 'కాళేశ్వరం ప్రాజెక్టు వృథా'అని వారు సృష్టించిన సిద్ధాంతాన్ని వారే అబద్ధమని నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం పంపింగ్ వ్యవస్థ ద్వారానే ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోశారనే నిజాన్ని మంత్రి పొన్నం అంగీకరించాలన్నారు.

**ఎల్లంపల్లిని వినియోగంలోకి తెచ్చాం**

కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై పెండింగులో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని హరీశ్‌రావు వెల్లడించారు. భూసేకరణ, పునరావాస కాలనీలు, కరీంనగర్–మంచిర్యాల రాజీవ్ రహదారిపై హైలెవెల్ వంతెన.. తదితర పనులు పూర్తి చేసి ఎల్లంపల్లిని తమ హయాంలోనే నింపామన్నారు. గతంలో కాంగ్రెస్ చేపట్టిన ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం 14 టీఎంసీలు కాగా, రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 141 టీఎంసీలకు పెంచామన్నారు. ఎల్లంపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసినా కూడా వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అయిన వసతుల వల్లే సాధ్యమైందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు–1 పునరుద్ధరణపై దృష్టిపెట్టి, 2025 వానాకాలం పంటలకు నీరు ఇచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషిచేయాలని హరీశ్‌రావు హితవు పలికారు.

**సీఎల్పీ భేటీకి అరికెపూడి ఎలా వెళతారు?**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి హాజరు కావడంపై మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలు.. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'సిద్దిపేట నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వస్తే కలుస్తాను. కానీ ఎల్పీ మీటింగ్‌కు వస్తే కలవను, ఏ ఎమ్మెల్యే కలవకూడదు కూడా. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టుంది శ్రీధర్ బాబు వైఖరి'అని హరీర్‌రావు వ్యాఖ్యానించారు.

# రాజకీయ అధిపత్యం కోసమే జమిలి ముసుగు

మొదటి పేజీ తరువాయి

లెక్కించాలి. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్‌గాంధీ ఆలోచన. ఆ మేరకు బీసీ కమిషన్ ఛైర్మన్‌ను, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. దీనిపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. త్వరలో ప్రజలకు హెల్త్ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నాం. రేషన్‌కార్డు ఏ ప్రాంతంలో ఉన్నా.. సరకులను రాష్ట్రంలో ఎక్కడైనా తీసుకునే అవకాశం కల్పిస్తాం.

**పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలి**

పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం.. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ,




ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలి. పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులిచ్చాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసినందుకే వారికి పదవులు కట్టబెట్టాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో రూ.18 వేల కోట్లతో పంట రుణమాఫీ చేయలేదు. రైతులను రుణ విముక్తుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం. అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది" అని అన్నారు.

**ఎమ్మెల్యేలకు సీఎం సూచనలు!**

సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు పలు సూచనలిచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు.. వారి నియోజకవర్గాల్లో సమర్థులైన అధికారులను, ఉద్యోగులను నియమించుకుంటే ప్రభుత్వ కార్యక్రమాలను వారు సక్రమంగా అమలు చేస్తారని.. తద్వారా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు మంచిపేరు వస్తుందని సీఎం చెప్పారు. కొందరు తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకుంటున్నట్లు తెలుస్తోందని, ఇది సరికాదని అన్నారు. ఎప్పుడు ఎవరొచ్చినా కలవడానికి తాను అందుబాటులో ఉంటానని.. కానీ ఇన్‌ఛార్జి మంత్రి స్థాయిలో అయ్యే చిన్నచిన్న పనులకు సైతం తన వద్దకు వస్తున్నారని రేవంత్ అన్నట్లు సమాచారం. ఇన్‌ఛార్జి మంత్రి వారానికి రెండుసార్లు జిల్లాకు వస్తారని.. ఏ పనైనా వారివల్ల కాకపోతే తన వద్దకు రావాలన్నారు. గత భారాస ప్రభుత్వం మాదిరిగా కాకుండా కాంగ్రెస్ సమర్థంగా పనిచేస్తోందన్నారు. ప్రజల్లో మంచి పేరు వచ్చేలా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పనిచేయాలని రేవంత్ సూచించారు.

# అటవీప్రాంతంలో విధ్వంసం ఆపాలి

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్ ఇందిరాపార్క్ సమీపంలోని ధర్నాచౌక్ లో 'దామగుండం ఐకాస' ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరై.. మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ దామగుండం అటవీప్రాంతం చుట్టూ ఉన్న 20 గ్రామాల్లో 60 వేల మందికి పైగా నివసిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతమిక్కడ రాడార్ ప్రాజెక్టు నిర్మిస్తుండటంతో లక్షల సంఖ్యలో వృక్షాలతో పాటు వన్యప్రాణులకు నష్టం జరుగుతుందన్నారు. మూసీ నది ప్రారంభ మయ్యే ఈ జిల్లాలో నీటి కాలుష్యంతో పాటు జీవవైవిధ్యం సహా పర్యావరణానికీ ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. సామాజిక ఉద్యమకారుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా అడవుల పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సినీనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ప్రజా గాయకురాలు విమలక్క, జర్నలిస్టు తులసి చందు, సత్యానంద స్వామి పాల్గొన్నారు.

# పర్యాటక ప్రచారంలో భాగస్వాములు కండి: మంత్రి జూపల్లి



**సోమాజిగూడ:** తెలంగాణ పర్యాటక ప్రచారంలో యువత భాగస్వాములు కావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి వాటికి ప్రాచుర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 27న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బుద్ధవనం థీమ్ పార్కు ప్రచారానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బైక్ రైడర్స్ సంయుక్తంగా హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బేగంపేటలోని హరిత ప్లాజా వద్ద రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో కలిసి మంత్రి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బైక్ రైడర్లతో కలిసి మంత్రి బైక్ నడుపుతూ తార్నాక వరకు వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బుద్ధుడి బోధనలను నేటి యువత అలవర్చుకొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో బైక్ రైడర్లు పాల్గొన్నారు.

# చిరంజీవికి విశిష్ట గౌరవం.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు..

మొదటి పేజీ తరువాయి

గానూ ఇటీవల పద్మవిభూషణ్ అవార్డును సొంతం చేసుకున్న ఆయన తాజాగా మరో విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీతోపాటు నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, జెమిని కిరణ్, మైత్రి రవిశంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, కేఎస్ రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిరంజీవికి అభినందనలు తెలిపారు. చిరుతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 'పునాదిరాళ్ళు' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు చిరంజీవి. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు, అవమానాలు ఎదుర్కొని.. స్టార్ హీరోగా ఎదిగారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేశారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణ

మొదటి పేజీ తరువాయి

మంత్రిగారికి ఇబ్బంది ఉం దంటే డేట్, టైం ఫిక్స్ చేస్తే ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమి షనర్ (సీవీసీ) దగ్గరికి పోదాం. ఒకవేళ మీరు రాకపోయినా ముచ్చే వారంలో సీవీ సీకి ఆధారాలు సమర్పిస్తా. సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి..' అని కేటీఆర్ అన్నారు.

**బావమరిది ఆ స్థాయికి ఎలా ఎదిగారో సీఎం చెప్పాలి**

'సీఎంను పొంగులేటి ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. సీఎం రేవంత్ రాజీనామా చేయాలి. ఈ ప్రభుత్వంలోని మంత్రులకు చట్టాలు మాత్రమే కాదు చుట్టరికాలు కూడా తెలిసినట్టు లేదు. భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. సొంత బావమరిది కంపెనీకి లాభం చేకూరిస్తే బంధువని అనడమేంటి?. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా నేను ప్రస్తావించిన నేపథ్యంలో పొంగులేటి ఆగమేఘాల మీద ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కానీ రూ.1,137 కోట్ల అవినీతి జరిగినా, ఒక్క రూపాయి అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలి.

**ఢిల్లీకి కప్పం కట్టేందుకే అవినీతి**

కేవలం రూ.2 కోట్ల లాభం ఉన్న బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదు అంటే ఎవరైనా నమ్ముతారా? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే సీఎం సోదరుడు జగదీశ్‌రెడ్డి రూ.వెయ్యి కోట్లుం, బావమరిది సూదిని సృజన్‌రెడ్డి రూ.వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టే స్థాయికి ఎలా ఎదిగారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి చెప్పాలి. పొంగులేటి సంస్థకు దక్కిన కొడంగల్ ఎట్టిపోతల కాంట్రాక్టుల గురించి త్వరలో మాట్లాడతా. ప్రజల తరపున మంత్రులు, ముఖ్యమంత్రి అవినీతిని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటాం. ఢిల్లీకి కప్పం కట్టేందుకు ప్రభుత్వం ఈ భారీ అవినీతికి తెగబడుతోంది. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించిన అంశంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మొదలు ఆ పార్టీకి చెందిన ఏ ఒక్క ఎంపీ కూడా మాట్లాడటం లేదు..'అని కేటీఆర్ విమర్శించారు.

**సింగరేణి కార్మికుల పొట్ట కొడుతున్నారు**

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.. 'దసరా బోనస్ కాదు బోగస్'అని కేటీఆర్ విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'సింగరేణి లాభాల్లో 33 శాతం కార్మికులకు పంచుతున్నట్లు గొప్పలు చెప్పుకుని కేవలం 16.9% మాత్రమే ఇచ్చారు. కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోంది., పండుగ వేళ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోంది. ప్రతి కార్మికుడికి రూ.1.8 లక్షల నష్టం జరుగుతుంది. సింగరేణి నికర లాభం రూ.4,701 కోట్లు. ఇందులో కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.1,551 కోట్లు పంచాలి. ఒక్కో కార్మికుడికి రూ.3.7 లక్షల చొప్పున అందాలి. కానీ కేవలం రూ.796 కోట్లను మాత్రమే కార్మికులకు పంచుతున్నారు..'అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సింగరేణి లాభాల్లో వాటాపై కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందని, ఒక్కో కార్మికుడికి అత్యధికంగా 32 శాతం వాటా ఇచ్చామని చెప్పారు.

# శ్రీలంక అధ్యక్షుడిగా దిస్సనాయకే

మొదటి పేజీ తరువాయి

ఓట్లు వచ్చాయి. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే తొలి రౌండులోనే పోటీ నుంచి వైదొలిగారు. శ్రీలంక నూతన అధ్యక్షుడిగా దిసనాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన నేతృత్వం వహిస్తున్న పార్టీల కూటమి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) వెల్లడించింది. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శనివారం జరగ్గా.. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదట తొలి ప్రాధాన్య ఓట్లను లెక్కించినప్పటికీ... అందులో విజయానికి అవసరమైన 50 శాతానికి పైగా ఓట్లు ఏ అభ్యర్థికీ రాలేదు. దీంతో గెలుపును నిర్ధరించేందుకు రెండో రౌండ్ కౌంటింగ్ చేపట్టారు. ఇందులో కుమార దిసనాయకే విజయం సాధించారు. మొత్తం 1.7 కోట్ల మంది నమోదిత ఓటర్లలో 75 శాతానికి పైగా ప్రజలు ఓటు వేశారు. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. శ్రీలంక నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దిసనాయకేకు భారత్ శుభాకాంక్షలు తెలిపింది.

**చరిత్రలో తొలిసారి..**

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో రెండో రౌండ్ లెక్కించే పరిణామం గతంలో ఎన్నడూ ఎదురుకాలేదు. మొదటి ప్రాధాన్య ఓట్ల సమయంలోనే విజేత ఎవరో ఖరారయ్యేవారు. ఈసారి ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడం తో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి వచ్చిందని ఎలక్షన్ కమిషన్ ఛైర్మన్ ఆర్ఎంఏఎల్ రత్నాయకే వెల్లడించారు.

# ఉగ్ర కుట్రల్లో ఒవైసీ కాలేజీ ఫ్యాకల్టీ

మొదటి పేజీ తరువాయి

ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ ధర్మంపై దాడిలో భాగంగానే తిరుపతి లడ్డూలో కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ వివాదంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టి సారించారని తెలిపారు. కేటీఆర్‌కు మీడియా అంటే ఫోబియా అని, అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారణ చేస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసు విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు అవినీతిలో కూరుకుపోయిందని కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న క్రమంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్త మంథని రాజేందర్ కుటుంబాన్ని సంజయ్ ఆదివారం పరామర్శించి, కుటుంబ



సభ్యులకు ఆర్థికసాయం చేశారు.

**మోదీతో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు: లక్ష్మణ్**

ప్రధాని మోదీ పాలనలో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని, ఇది చూసి ఓర్వలేని కాంగ్రెస్.. లేనిపోని నిందలువేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా తుక్కుగూడలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు.

# సింగరేణి, జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండం విద్యుత్ ప్లాంటు

మొదటి పేజీ తరువాయి

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ థర్మల్ విద్యుత్ ప్లాంటును నిర్మించాలని సీఎంకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై చర్యలు తీసుకోవా లని సీఎం కార్యాలయం ఆదేశాలిచ్చినట్లు తాజాగా రాష్ట్ర ఇంధనశాఖ జెన్‌కోకు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

**అంగీకరించేది లేదు: రాష్ట్ర ఇంజినీర్ల సంఘం**

జెన్‌కో, సింగరేణి సంయుక్త భాగస్వామ్యంలో కొత్తగా థర్మల్ విద్యుత్ ప్లాంటును నిర్మించాలని తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఇంజినీర్ల సంఘం తెలిపింది. జెన్‌కోనే సొంతంగా దీన్ని నిర్మించాలని కోరుతూ ఆదివారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం మీడియాకు వెల్లడించారు.

# దసరాకు 'కేబినెట్' ధమాకా!

మొదటి పేజీ తరువాయి

మంత్రివర్గ విస్తరణ ఖాయమని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే నెల 5వ తేదీ తర్వాత ఎప్పుడైనా కొత్త మంత్రులు కొలువుదీరనున్నారని నేతలు చెబుతున్నారు. ఎవరెవరికి చాన్స్ ఇవ్వాలన్న దానిపై మరోమారు చర్చలు జరిపి ఖరారు చేయనున్నట్లు వివరిస్తున్నారు.

**బెర్తుల కోసం పోటాపోటీ:** నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో గరిష్ఠంగా సీఎం సహా 18 మందికి మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రులు ఉన్నారు. దీనితో మరో ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించే వెసులుబాటు ఉంది. వీటి కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. తమకంటే తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్లో ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచే కాకుండా.. మిగతా జిల్లాల నుంచి కూడా డజను మందికి పైగా ఎమ్మెల్యేలు తమకు కేబినెట్ బెర్త్‌పై ఆశతో ఉన్నారు. ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని జిల్లాల నుంచి పరిశీలిస్తే.. మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), జి.వివేక్, జి.వినోద్, కె.ప్రేమ్‌సాగర్‌రావు (ఆదిలాబాద్), పి.సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్), దానం నాగేందర్, అమీన్ అలీఖాన్ (హైదరాబాద్) మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ (నల్లగొండ), వాకిటి శ్రీహరి (మహబూబ్‌నగర్), టి.జీవన్‌రెడ్డి (కరీంనగర్) కూడా కేబినెట్ బెర్త్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. వీరికితోడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావు, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు కూడా సామాజిక వర్గాల ప్రాతిపదికన చాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

**సామాజిక సమీకరణాలే ప్రాతిపదికగా..:** కాంగ్రెస్ ఎమ్మెల్యేల లో ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న దానిపై అధిష్ఠానం ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పదవికి, కేబినెట్ విస్తరణకు మధ్య సామాజిక వర్గాల వారీగా లెక్కలు కుదరకపోవడంతో నిర్ణ యం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా పీసీసీ అధ్యక్షు డిగా బీసీ నేతను నియమించడంతో మిగతా సామాజిక వర్గా లకు మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయంలో ఓ నిర్ణయం తీసుకునే వెసులుబాటు కలిగింది. ప్రస్తుతం మంత్రిమండలిలో ఏడుగురు ఓసీ వర్గానికి చెందినవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా రు. ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు బీసీలు, ఒక ఎస్టీ నేత ఉన్నారు. కులాల వారీగా చూస్తే నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. ప్రస్తుతం రెడ్లకే చెందిన మరో నేతకు మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వనున్నట్టు అంచనా. మాదిగ, ఎస్టీ (లంబాడా), బీసీ సామాజిక వర్గాలకు కూడా ఒక్కో బెర్త్ కేటా యించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎవరికన్నది పార్టీ వెసులుబాటు ప్రకారం కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# 8 ఎకరాల్లోని 44 నిర్మాణాలు కూల్చివేత

మొదటి పేజీ తరువాయి

ఇతర నిర్మాణాల వద్ద వాటి యజమానులు, లీజుకు తీసుకున్నవారు ఆందోళన చేస్తుండడంతో పోలీసులు వారిని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నవారి వద్దకు హైడ్రా అధికారులు వెళ్లలేదు. మూడు ప్రాంతాల్లో మొత్తం 8 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటి విలువ రూ.200 కోట్లు ఉంటుందన్నారు.

**ఉదయాన్నే కూల్చివేతలు..**

హైడ్రా అధికారులు మూడు బృందాలుగా విడిపోయి నల్లచెరువు, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడకు ఉదయం 6 గంటలకు భారీ బందోబస్తుతో చేరుకున్నారు. విద్యుత్ శాఖ సిబ్బందిని పిలిపించి కూల్చివేయనున్న షెడ్లు, నిర్మాణాలకు కరెంటు సరఫరా నిలిపేయించారు. 7.30 గంటలకు మొదలైన కూల్చివేతలు.. మధ్యాహ్నం 12.30వరకు కొనసాగాయి. నల్లచెరువులో 3 భారీ క్యాటరింగ్ కిచెన్లు, ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్, వాటర్ ప్లాంట్, ప్లైవుడ్ గోదాము, ముడిసరకు గోదాములు, గదులు, ప్రహరీ గోడలున్నాయి. అన్నింటినీ నేలమట్టం చేశారు. నల్లచెరువు వద్ద హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ రామిరెడ్డి, ఏసీపీ రమేశ్‌కుమార్.. కిష్టారెడ్డిపేట, పటేల్ గూడల్లో హైడ్రా ఎస్పీ పాపయ్య, డీసీపీ శ్రీనివాసరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
సోమవారం, 23 సెప్టెంబరు 2024

# తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెద్దపీట

## రైతులు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, రైతులు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రోజున ఆలేరు లోని ఏఎన్ఆర్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిధులుగా రోడ్లు, భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఈ కార్యక్రమంలో పాల్గొనీ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకుంటున్నామన్నారు.. ఇప్పటివరకు రైతు ఖాతాలో 7650 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. రెండు లక్షల వరకు ఉన్న రైతు రుణాలను కూడా మాఫీ చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా నల్లగొండ జిల్లా లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని అన్నారు. జిల్లాలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాలలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రితో కలిసి వస్తానని తెలిపారు. ఇక్కడికి వచ్చిన రైతు సోదరీ సోదరీమణులకు నా యొక్క ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. త్వరలో వ్యవసాయ మార్కెట్ కు వ్యవసాయ గిడ్డంగులను మంజూరీ చేయిస్తానని తెలిపారు. తెలంగాణ వస్తే త్రాగునీరు, సాగునీరు ,ఉద్యోగ అవకాశాలు వస్తాయని, భావించామని అందుకు అనుగుణంగా మా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చైర్మన్లు, వైస్ చైర్మన్ లు, డైరెక్టర్ ను ఉద్దేశించి మాట్లాడుతూ పదవిని బాధ్యతగా చూసుకోవాలని, బాధ్యతగా భావించినప్పుడే ప్రజలకు సేవ చేయగలుగుతారని మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. మార్కెట్ అభివృద్ధికి రైతు శ్రేయస్సుకు పాటుపడాలని మంత్రి కోరారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించ డానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్క ఊరిలో ఉన్న సమస్యల గురించి నాకు తెలుసునని అన్ని సమస్యలను త్వరగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని,గ్రామాలు బాగుంటాయని మంత్రి తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా 200 యూనిట్ల వరకు కరెంటును ఇవ్వడం జరిగిందన్నారు. అనిమహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని, దానిలో భాగంగా మహిళలు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో,మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదర్ గౌడ్, పాలకులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సేవ చేసేందుకే తనను ప్రజలు ఎన్నుకున్నారని, వారి సమస్యలను పరిష్కరించడమే తన వంతు కర్తవ్యం

### భువనగిరి మున్సిపల్ చైర్మన్... పోతంశెట్టి వెంకటేశ్వర్లు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– ప్రజా సేవ చేసేందుకే తనను ప్రజలు ఎన్నుకున్నారని, వారి సమస్యలను పరిష్కరించడమే తన వంతు కర్తవ్యం అని, జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్త కుమార్ రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు ఆదేశాల మేరకు వారు ఇచ్చిన సలహాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలు అన్నీ మట్టి ఇసుక,చెత్తతో కూరుకుపోగా, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు మున్సిపల్ కార్మికులతో కలిసి స్వయంగా డ్రైనేజీని క్లీన్ చేయడం జరిగింది. అలాగే జగదేవ్పూర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున కొట్టుకొని వచ్చిన మట్టి రాళ్లు ఇసుకను ఉదయం 6 గంటలకే జెసిబి తో రెండు ట్రాక్టర్లను, పదిమంది పారిశుద్ధ సిబ్బందిని పెట్టుకొని అంతా కూడా క్లీన్ చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగాకుండా చూడటమే మన లక్ష్యమని, భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి మాతో చెప్పడం జరిగిందని, అట్టి విషయాన్ని ఆయన మాటలను దృష్టిలో పెట్టుకొని భువనగిరి పట్టణంలో ప్రజలకు ఎప్పటికప్పుడు ఏ సమస్యలు వచ్చినా మున్సిపల్ సిబ్బంది అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాసేవ కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ కూడా మున్సిపల్ తో కలిసి భువనగిరి పట్టణాన్ని క్లీన్ చీటీగా మార్చాలని ఏకైక లక్ష్యంతో పనిచేయాలని చెప్పి బోనగిరి పట్టణ ప్రజలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు.



## అర్హులైన జర్నలిస్టుల వివరాల సేకరణ చేపట్టాలి

### జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయం

### సహకరించాలని కోరిన జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22(వాయిస్ టుడే) అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం యూనియన్ పకడ్బందీగా పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం సూరారం వి.ఐ.పి ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మునిపెన్నడూ లేని విధంగా జర్నలిస్టులకు హౌసింగ్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం



జీవోలు జారీ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తుందని తెలిపారు. ఇది ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వం పెద్దలు చూపిస్తున్న మార్గదర్శకళ మేరకు సమాజంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ, మండలాల వారిగా సమావేశాలను నిర్వహించి వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. రానున్న వారం రోజులలో ప్రాంతాలవారీగా సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైందని స్పష్టం చేశారు. జిల్లాలో సేకరిస్తున్నటువంటి జర్నలిస్టుల వివరాలను మీడియా అకాడమీకి అందజేస్తామని జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాలరాజ్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో జూనియర్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రితో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి జర్నలిస్ట్ కృషి చేయాలని కోరారు. యూనియన్లకు అతీతంగా మండలాలు నియోజకవర్గం వారిగా సీనియార్టీ ప్రతిపాదికతన లిస్టులను తయారు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కోశాధికారి బిక్షపతి, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్ మెట్టులో రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

అబ్దుల్లాపూర్ మెట్టు: సెప్టెంబర్22 (వాయిస్ టుడే) విజయవాడ హైవేలో ఆదివారం మహిళ రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ బస్సు ఢీ ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు అక్కడికి చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని పలువురు పేర్కొన్నారు. మృతురాలు యాచకురాలు అని భావిస్తున్నారు.

## అతి పవిత్రమైన తిరుపతి లడ్డుకు అపవిత్రత

### కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారు.

### సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు ఆవేశం

వాయిస్ టుడే సెప్టెంబర్ 22 ( సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి ) ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి పాత్రుడైన తిరుపతిలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డు విషయమై రాజకీయాలు చేసుకోవడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా ఆదివారం నాడు ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ నీ దర్శనం కాకపోయినా నీ ప్రసాదం చూస్తే నిన్ను చూసినట్టే అని మురిసిపోయేవాళ్లం కానీ ఈనాడు ఈ ప్రసాదం చూస్తేనే భయపడే స్థితికి వచ్చామని , ఇకనైనా ఉన్నత అధికారులు కళ్లు తెరవాలన్నారు. తిరుపతి లడ్డు రుచి, వాసన ప్రపంచంలో ఏ లడ్డుకు ఉండదన్నారు. పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ లడ్డు పవిత్రతను దెబ్బతీస్తున్నారన్నారు. ఇకనైనా మేల్కొని దేవాలయం పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకోటి ప్రతినిధులు చిగుర్లపల్లి వెంకటేశం, ముడిపడిగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## ఫ్రీ ఫ్లెక్స్ సిటీ అమలులో కార్పోరేషన్ విఫలం

### పౌర సంక్షేమ సంఘం..

కాకినాడ, సెప్టెంబర్22 (వాయిస్ టుడే ప్రతినిధి) పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లకు ఇరువైపులా ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. నెలల క్రిందట జిల్లా కలెక్టర్ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ సగిలి షాన్మోహన్ జిల్లా కేంద్రాన్ని ఫ్లెక్స్ ఫ్రీ రోడ్స్ గా చేయాలని ఆదే శాలు ఇచ్చినప్పటికీ కాకినాడ నగరంలో ప్రతి చోట రాజకీయ వ్యాపా ర వ్యక్తిగత ఫ్లెక్సీలు బోర్డులు కనిపిస్తున్నాయి. ఈ మేరకు పౌర సంక్షేమ సంఘం నిరసన వ్యక్తం చేసింది. టుటౌన్ నుండి జగన్నాధపురం మెయిన్ రోడ్ సర్పవరం నుండి భానుగుడి వరకు కోకిల జంక్షన్ నుండి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు సినిమా రోడ్ లోనూ ఫ్లెక్స్ ఫ్రీ రోడ్ నిర్వహణ చేయడం లో కార్పోరేషన్ సిటీ ప్లానిం గ్ విభాగం పూర్తిగా విఫలమైందని పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి దూసర్లపూడి రమణ రాజు విమర్శించారు. అధికార పార్టీ ఫ్లెక్సీ లతో బాటుగా వ్యాపార వాణిజ్య వ్యక్తిగత ఫ్లెక్సీ లు ఇష్టానుసారంగా స్ట్రీట్ లైటింగ్ స్తంభాల కు,కార్నర్ జంక్షన్లకు బ్రిడ్జీలపైన నెలకొల్ప డం షరా మామూలుగా వుందన్నారు. రూల్స్ అతిక్రమించిన వారిపై జరిమానాలు కేసులు నమోదు చేసే ప్రక్రియ లేక పోవడం వలన కలెక్టర్ ఉత్తర్వులను కార్పోరేషన్ అధికారు లు ఉద్యోగులతో బాటుగా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇరువురు ఐ ఎ ఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్ గా కమీషనర్ గా వున్నప్ప టికీ స్మార్ట్ సిటీ ఆకర్షణ కు అవసరమైన ఫ్లెక్స్ ఫ్రీ రోడ్స్ నిర్వహణ కాగితాలకు మాత్రమే పరిమితం కావడం తగదన్నారు. ఫ్రీ ఫ్లెక్స్ సిటీ నిర్వహణ పై రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు వ్యాపార వర్తక వాణిజ్య ఉద్యోగ సంఘాలతో కమీషనర్ సమావేశం నిర్వహించి గైడ్ లైన్స్ విడుదల చేయాలని పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్ల పూడి రమణరాజు కోరారు.

# అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి చేసిన సేవలకు ముగింపు లేదు

### పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న సైద్ధాంతిక పోరాటం వెలకట్టలేనిది

### మాజీ పార్లమెంటు సభ్యులు పి మధు



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే 22 ) భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారామయ్య చూరిచేసిన సేవలకు ముగింపు లేదని మాజీ పార్లమెంట్ సభ్యులు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పి మధు అన్నారు స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన సీతారామయ్య చూరి సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ ఫెడరలిజం పై దాడి జరుగుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి కాకుండా దేశానికి తీవ్రమైన నష్టమని అన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం సోవిటీ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత వెనకపట్టు పట్టిన సందర్భంలో కాంగ్రెస్ సీతారాం ఏచూరి బెంగాల్ కేంద్రంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు ఏర్పాటు చేసి కమ్యూనిజానికి మరణం లేదని దేశంలో కష్టజీవులు కార్మికులు ఉన్నంతకాలం పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంతకాలం కమ్యూనిజానికి సోషల్జానికి మరణం లేదని చాటి చెబుతూ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి భరోసా నిచ్చే పద్ధతిలో కమిటీ ఏచూరి అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు పార్లమెంటులో అనేక రకాల సమస్యలపై ఇతర రాజకీయ పార్టీలు సైతం అంగీకరించే విధంగా కామ్రేడ్ ఏచూరి తన వాదనలను వినిపించేవాడని అన్నారు. విద్యార్థి దశనుండే కమ్యూనిస్టు రాజకీయాల్లోకి వచ్చిన ఏచూరి తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పనిచేసే బతికినంత కాలం తన దేహం ప్రజాసేవకు చనిపోయిన తర్వాత కూడా తన దేహం ప్రజాసేవకే అంకితం అంటూ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఇవ్వడం కమ్యూనిస్టులకు ప్రజలపై ఉన్న అభిమానం దేశం పట్ల బాధ్యత ఏంటో తెలియజేసిందని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడుతున్న సందర్భంలో కామ్రేడ్ ఏచూరి వేగుచుక్కల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో తీవ్రమైన కృషి చేశారని ఆయన చేసిన కృషిలో సైదాంతిక కృషికి వెలకట్టలేమని అన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి బాటలో కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన

## రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్..

## నిడదవోలులో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



నిడదవోలు, సెప్టెంబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి సంక్షేమం, అభివృద్ధి బాటలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన సాగిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి100 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలులో నిర్వహించారు.. కార్యక్రమంలో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలోని జ్యోతి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సుబ్బరాజుపేటలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వందరోజుల ప్రగతిని, సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకొని ప్రజా ఆమోదంతో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడకు అతికించారు. ప్రజలందరి సమక్షంలో కేక్ కట్ చేసి 100 రోజుల ప్రభుత్వ ప్రగతి కరపత్రాలు పంపిణీ చేశారు.వాడవాడలో తిరుగుతూ మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, రైతులు, విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దుర్గేష్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు విని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేగాక భారీ వర్షాల కారణంగా నిడదవోలు మండలంలోని కోరుపల్లి, విజ్జేశ్వరం, నిడదవోలు లో పాక్షికంగా దెబ్బతిన్న 5 గృహాలకు సంబంధించి ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, ఒక్కో కిలో చొప్పున కందిపప్పు, పంచదార, పామ్ ఆయిల్, రెండు కిలోల చొప్పున ఉల్లిపాయలు, బంగాళదుంపలను ఆయా కుటుంబాలకు మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. స్థానికంగా అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఘన నివాళులర్పించి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా తీరు గూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ,సంక్షేమాన్ని అందిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకుంటుందని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక భద్రత పెన్షన్లను పెంచిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 2000 నుండి 3000 కి పెన్షన్ పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంటే కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజుల్లోనే పెన్షన్ ను నాలుగు వేలకు పెంచి ప్రజలకు ఒకటవ తేదీనే ఇంటి వద్ద అందించింది అన్నారు. అంతేగాక ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పెంచిన పెన్షన్ లను జూలైలో ప్రజలకు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్నా క్యాంటీలను పునరుద్ధరించామని తద్వారా పేద ప్రజల కడుపు నింపుతున్నామన్నారు. 16,000 కు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన చేశామని తెలిపారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో దీపావళి నుండి ప్రజలకు మూడు ఉచిత సిలిండర్లు అందజేయనున్నామన్నారు.. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా నెరవేరుస్తామన్నారు.

### నిడదవోలు పట్టణానికి వరాల జల్లు..

ఈ సందర్భంగా నిడదవోలు పట్టణానికి మంత్రి వరాల జల్లు కురిపించారు. నిడదవోలు పట్టణంలో ఇప్పటికే ఒక మినీ స్టేడియం మంజూరు చేశామని, త్వరలోనే దానిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. స్థానిక ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్ గా తీర్చిదిద్దుతామన్నారు. తద్వారా అవసరమైన వైద్యులు, సిబ్బంది వస్తారని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గోదావరి జలాలను పట్టణంలోకి తీసుకువస్తామని మంత్రి పేర్కొన్నారు.. పట్టణానికి సమర్థవంతంగా పనిచేయగలిగే కమిషనర్ వచ్చారని ఈ సందర్భంగా కొనియాడారు. నిడదవోలు పట్టణం అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వం తరపున వచ్చే నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే టిడ్కో ఇళ్లు, డ్రైనేజీలు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి పలు సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపిస్తామన్నారు.ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యే అని అనిపించుకోవడం కన్నా ప్రజల సేవకుడనని అనిపించుకోవడమే ఇష్టమని చెప్పానని, ఇప్పుడు ప్రజా సేవ చేస్తూ ఆ మాట నిజం చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.రాబోయే ఐదేళ్లలో ప్రజల బాగోగులు చూస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రజలంతా మంచి మనసుతో, అమృత హస్తాలతో కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.తన విజయానికి కారణమై ఎమ్మెల్యేను చేసి మంత్రిగా అవకాశం కల్పించిన నిడదవోలు పట్టణ ప్రజలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంకల్పం సిద్ధించే దిశగా పని చేస్తామన్నారు.

### తిరుమల ఘటనపై మంత్రి ఆగ్రహం..

ప్రపంచంలో వాటికన్ సిటీ తర్వాత అత్యధిక భక్తులు తిరుమల తిరుపతి క్షేత్రానికి వస్తారని తెలిపారు. అలాంటి పరమ పవిత్రమైన క్షేత్రమైన తిరుమల లడ్డులో నాణ్యత లోపించిన నెయ్యి, కల్తీ నెయ్యిని వాడారని అన్ని చోట్ల వినబడుతుంది అన్నారు. గత ప్రభుత్వం సాక్షాత్తు వెంకటేశ్వర స్వామికి అపచారం తలపెట్టింది అన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గ పాలనను గుర్తించి, భగవంతుడు శిక్షించి ఇంటికి పంపించాడని విమర్శించారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా పవిత్ర తిరుమల లడ్డు అపవిత్రమైన కారణంగా సమాజం మొత్తానికి ఇబ్బంది కలుగుతుందని భావించి, రాష్ట్ర ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో, ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలన్న సదుద్దేశంతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష కూర్చొని ప్రజలను కాపాడాలని అన్నారు. కేవలం హిందూ మతానికి ఇబ్బంది కలిగిందనే కాదు, ముస్లిం, క్రైస్తవం, ఇలా ఏ మతానికి ఇబ్బంది కలిగినా ప్రభుత్వం ఇదే విధంగా స్పందిస్తుందని అన్నారు. స్పందించాలన్నారు. సింహాచలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని వార్తలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ బండారం బయట పెట్టామన్న ఉద్దేశంతో డైవర్షన్ పాలిటిక్స్ కి కొందరు తెరతీసారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో నిడదవోలు పట్టణ కమిషనర్ టి.ఎల్.పి.ఎస్.ఎస్. కృష్ణవేణి, తహసీల్దార్ నాయక్, పట్టణ జనసేన అధ్యక్షులు రంగా రమేష్, టిడిపి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నిడదవోలు పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి నీలం రామారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు విష్ణువర్ధన్ పరామర్శ



వాయిస్ టుడే, హనుమకొండ: నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను ఆదివారం వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి పరామర్శించారు. నియోజకవర్గంలోని 51వ డివిజన్ వినాయక నగర్ లో నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు యువతకు అండగా నిలవాలనే సదుద్దేశంతో తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో విష్ణువర్ధన్ రెడ్డి వారికి బియ్యం అందించారు. 51వ డివిజన్ అధ్యక్షులు కొండ నాగరాజు ప్రమాదవశాషత్తు రోడ్డు ప్రమాదంలో గడిపడిన క్రమంలో హౌసింగ్ బోర్డు కాలనిలో వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 60వ డివిజన్ వడ్డేపల్లిలో ఇటీవల మరణించిన మిడిదొడ్డి యాదయ్య మరియు పసునూరి నర్సమ్మ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, కౌటిల్ రెడ్డి, సంగాల ప్రణీత్, డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్, తాళ్ళపెల్లి రవీందర్ (జెకే), మండల సమ్మాయ్య, మిడిదొడ్డి శేఖర్, పిట్టల వంశీ, హరీష్, యుగేందర్, అక్మాల్ ప్రసాద్, కమల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి మహా ప్రసాదం లడ్డూను 35వేలకు కైవసం చేసుకున్న బత్తిని మల్లేష్ కుటుంబ సభ్యులు



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: శ్రీరామ్ యూత్ అసోసియేషన్ యాదగిరిగుట్ట శ్రీరామ్ నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో విశేష పూజలు అందుకుంటున్న విఘ్నేశ్వరుడు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెలిమెల్లి శ్రీధర్ గౌడు ఆద్వర్యంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరిగాయి..వినాయక లడ్డు వేలం పాట పోటాపోటీగా సాగింది లడ్డూ వేలం లో భక్తులు పోటీ పడ్డారు చివరికి.. లడ్డూను35000 వేలకు కైవసం చేసుకున్నారు బత్తిని మల్లేష్ దంపతులు.. యూత్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్ ను శాలువాతో ఘనంగా సన్మానించి మహా ప్రసాదం లడ్డూను అందజేశారు.. ఈ కార్యక్రమంలో పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ ,బండారి హరిప్రసాద్ పల్లపాటి మహేష్.శివరాత్రి మహేష్ ,గుండ్ల ఓంకార్ గౌడ్,సదా ప్రవీణ్,బొజ్జ క్రాంతి,వరుణ్,సాత్విక్ ,క్రాంతి, అఖిలానంద్, అభిరామ్, అలీంబాబా,ధనుష్, ముఖేష్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ 2001-02 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 22 (వాయిస్ టుడే): రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల లో 2001-02 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు జ్యోతి ప్రజ్వలన గావించి సరస్వతీ ప్రార్థన ఆలపించి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలతో తమకున్న మధురానుభూతులను గుర్తుచేసుకొని ఉల్లాసంగా గడిపారు. గత 22 సంవత్సరాల క్రితం పాఠశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తమ బాల్యం నాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు తమ కుటుంబాల నేపథ్యాలను పరిచయం చేసుకొని ఒకరినొకరు అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునాథరావు, రమాదేవి, సుఖేందర్, రాజన్న, రాజు, రాజమణి, పూదరి సత్యనారాయణ ,శ్రీరామ నరసయ్య, సురేష్ ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రకాష్ నగర్ బ్రిడ్జి నుండి వాహనాలు పోనివ్వాలి

### సీపీఎం సీనియర్ నాయకులు కోలేటి ఉపేందర్ రావ్ డిమాండ్



ఖమ్మం జిల్లా సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : 20రోజుల క్రింద వచ్చిన వరదకు బ్రిడ్జి ఒక అడుగు పై స్లాప్ 8 అంగుళాలు కదిలింది ఆ తర్వాత అధికారులు నిద్రలేచేసరికి 5 రోజులు అయింది అప్పటి వరకు భారీ వాహనాలు కూడా ప్రయాణం చేశాయి. ఆ తర్వాత హడావిడిగా రోడ్డు మూసి వేస్తున్నట్లు గోడ కట్టారు. పనులు మొదలు పెట్టకుండా ద్విచక్ర వాహనాలు కూడా ఆపడం అధికారుల ప్రజా ప్రతినిధుల నిరంకుశ వైఖరి తప్ప మరొకటి కాదని సీపీఎం నాయకులు ఉపేందర్ రావ్ అన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దారి మూయడం వల్ల రోజు వేల మంది 15 కిలోమీటర్లు అదనంగా ట్రాఫిక్ ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ పిల్లలు రోజు ఉదయం సాయంత్రం అదనంగా మూడుగంటల ప్రయాణం చేసి స్కూల్ కి పోయే పరిస్థితి లేదని మార్కెట్ కి పంటలు తీసుకొని రావాలన్న పోయే పరిస్థితి లేదని రోజు వందలాది మంది త్రీ టౌన్ నుండి వెంకటగిరి వైపు మిర్చి తొడాలు తీయడానికి వస్తారు అలాగే చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. కాబట్టి వెంటనే మున్నేరులో నీళ్లు తగ్గినవి కింద నుండి దారి పోయాలని ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా నిర్లక్ష్యం తో నిరంతరం జిల్లా ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వెంటనే ఈ దారి ఏర్పాటు చేయక పోతే ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని సీపీఎం నాయకులు ఉపేందర్ రావ్, తెలంగాణ రైతు సంఘం ముదిగొండ మండల కమిటీ హెచ్చరించింది.



## రాష్ట్రానికి ఒక బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు

### వైసిపి ప్రభుత్వం లో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదు

### గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

### ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

అనంత పురం సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : శింగనమలనియోజకవర్గం,నార్పల మండలంలోని చామలూరు గ్రామం నందు జరిగిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం పనులు కింద చామలూరు గ్రామంలో 250 మీటర్ల సిసి రోడ్లు అభివృద్ధి పనులు సంబంధించిన శిలాఫలకము ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రారంభించారు. అలాగే స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద కేసేపల్లి,దుగుమర్రి గ్రామపంచాయతీలకు 2 ట్రాక్టర్లను పంపిణీ చేశారు.ఐ.సి.డి.ఎస్ కార్యక్రమం భాగంగా నిర్వహించిన అన్న ప్రాసన కార్యక్రమంకు హాజరైనారు.

నియోజకవర్గ రైతుల,ప్రజల సాగునీరు తాగునీరు అవసరాల కోసం 10 రోజులు ముందే హెచ్.ఎల్.సి. కెనాల్ కు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.ఇదే చామలూరు గ్రామంలో గత ప్రభుత్వంలో కనీసం ఒక ఇటుక కూడా వేయలేదు కానీ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులోన్నే కొత్త సీసీ రోడ్డు పనులకు నిధులు విడుదల చేసాం అని తెలిపారు.గత ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని,కానీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి హర్షం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రావణి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో మేనిఫెస్టో లో పొందుపరిచిన పథకాలు అన్నింటిని నెరవేరుస్తున్నారని అన్నారు. అభివృద్ధికి సంక్షేమానికి ఒక బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని స్పష్టం చేశారు. ?3,000 పెన్షను 4000 రూపాయల కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వాన్ని దేనని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 16 వేల డిఎస్సి పోస్టులను భక్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: ఉద్యోగరీత్యా సుదీర్ఘకాలం శాఖాపరమైన సేవలను అందించి విశ్రాంత జీవితం గడుపుతున్న విశ్రాంత ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం అభినందనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ పూర్వపు సంచాలకులు బి రాజమౌళి అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లి జంక్షన్ సమీపంలో గల శ్రీమాత బాంకేట్ హాలులో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విశ్రాంత ఉద్యోగులలో ఆత్మీయ అనుబంధం తో పాటు ఆత్మ స్థైర్యం పెంపొందుతుందని శాఖాపరంగా జిల్లా స్థాయిలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రంలో ప్రథమమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ధోరణిలో కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం అందరిలో ఒక నూతన ఉత్తేజాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తుంది అన్నారు. ఇలాంటి దృక్పథం ఇతర జిల్లాలకు కూడా మార్గదర్శకం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత అధికారులు సిబ్బంది తమ అనుభవాలను అభిప్రాయాలను పాలుపంచుకున్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత అధికారులు పాకాల భాస్కర్, ముర్తుజా, వెంకటనారాయణ, మల్లయ్య, ఇమ్మానియేల్, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, సారయ్య, విధుమౌళి, సుధాకర్, దేవేందర్ రెడ్డి, సుదర్శన్ -వయోవృద్ధులు కట్టయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరూ ఆహ్లాదకర వాతావరణంలో సామూహిక భోజనం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విశ్రాంత ఉద్యోగులకు విశ్రాంత అధికారి పాకాల భాస్కర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# సిపిఎం పార్టీ నాయకునిపై బురదజల్లే ప్రకటనలు మానుకోవాలి

### కొమ్మూరి ప్రతాపరెడ్డి తన వైఖరి మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో తన అవినీతిని నిరూపిస్తాం



వాయిస్ టుడే సెప్టెంబర్ 22( సిద్దిపేట జిల్లా ప్రతినిధి): సిద్దిపేట జిల్లా చేర్యాల మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప రెడ్డి చేర్యాల ప్రాంతానికి ద్రోహం చేస్తూ చేర్యాల ప్రాంత అభివృద్ధికి ఆటంకంగా మారిండని, చేర్యాల ప్రాంతంలో భూ దందాలు నిర్వహిస్తూ, నామినేటెడ్ పదవులను అమ్ముకుంటూ స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నాడని ఇతని అవినీతి పనులను సమర్థిస్తున్న కొంతమంది తమ సొంత లాభాల కోసం పూటకో పార్టీ మారుతూ ఏ పార్టీకి అధికారం ఉంటే ఆ పార్టీ లో చేరే స్వార్థపరుల తో ప్రజల కోసం నిరంతరం పోరాడే సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డిని విమర్శించే అర్హత లేదని దీనిని సిపిఎం పార్టీ చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు తీవ్రంగా ఖండించారు. ఆదివారం రోజున చేర్యాల సిపిఎం పార్టీ కార్యాలయంలో ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొంగరి వెంకట మావో, రాళ్ల బండి నాగరాజు లు మాట్లాడుతూ సిపిఎం పార్టీ నాయకులు సిద్ధాంతపరంగా నిబద్ధతతో నిరంతరం ప్రజల కోసం పోరాడుతారని ఇందులో భాగంగా చేర్యాల ప్రాంతంలో ప్రాంత అభివృద్ధి కోసం చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని చేర్యాలలో కోర్టును ఏర్పాటు చేయాలని, చెరువు మత్తడి భూమిని కాపాడుకోవాలని, వడ్ల కొనుగోలు లో జరిగిన అవకతవకలను ఎండగట్టడంలో, అంబేద్కర్ రోడ్డు మూసివేత ను తిప్పి కొట్టడంలో ను చేర్యాల ప్రాంత ప్రజల సమస్యల పట్ల నిరంతరం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందని, ప్రజల కోసం నిస్వార్థ రాజకీయాలు చేస్తున్నామని కొమ్మూరి ప్రతాపరెడ్డి భూదాన్ భూమిని ఆక్రమించుకోలేదా, కొమ్మూరి ప్రతాపరెడ్డి వెంచర్ లో మున్సిపాలిటీకి ఎంత భూమి ఇచ్చిం డో చెప్పాలి, చెరువు మత్తడి పోరాటంలో అఖిలపక్షంతో ఉన్నట్టుండి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తో కుమ్ముక్కై హైకోర్టులో వేసిన కేసులను నీరుగార్చే విధంగా చేశాడని, చేర్యాలకు వచ్చే కోర్టును రాకుండా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉండి నిర్లక్ష్యం చేస్తున్నాడని వీటన్నింటినీ ప్రజాక్షేత్రంలో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని సిపిఎం చేసేది విమర్శలు కావని ఇవన్నీ వాస్తవాలని, ఈ వాస్తవాలను ఒప్పుకొని నీ వక్ర బుద్ధిని సరి చేసుకోవాలని లేని పక్షంలో సిపిఎం పార్టీ వదిలిపెట్టదని కొమ్మూరి ప్రతాపరెడ్డి అవినీతి అక్రమాలను సమర్ధించే తమ స్వార్థం కోసం పూటకో పార్టీ మారి అధికార కాంగ్రెస్ పార్టీ లో చేరి మా అంత గొప్పోళ్ళు లేరని విర్రవీగుతూ అర్థం లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఇప్పటికైనా మీ నాయకుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి చేస్తున్న అవినీతి పనులను ఇకనుంచైనా చేయనీయకుండా చూసుకోండని లేకుంటే పోరాటాల పురిటి గడ్డ అయిన ఈ చేర్యాల ప్రాంత ప్రజలు మిమ్ములను వెలివేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ముఖ్య కార్యకర్తలు గొర్రె శ్రీనివాస్ దర్శనం రమేష్ ఎర్రబోస్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులందరిని కన్వర్షన్ చేయాలి

### విధ్యుత్ జెఏసి ఏర్పాటు



భద్రాచలం, సెప్టెంబర్ 22 (వాయిస్ టు డే ) ఆర్టిజన్ కార్మికులందరిని కన్వర్షన్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మచారి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఈఈయు) జిల్లా అధ్యక్షులు కొలగాని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకై ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు విద్యుత్ రంగం లోని యూనియన్ల తో కలిపి తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ జెఏసి సమావేశం లో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టిజన్లను మోసం చేసిందని అన్నారు. పలుమార్లు అసెంబ్లీలో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పి అటు కాంట్రాక్టు, కార్మికులను పర్మినెంట్ కాకుండా ఆర్టిజన్లను మోసం చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టిజన్ లు చేయడానికి కూడా అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్లో చాలా సబ్ స్టేషన్లలో కార్మికులు ఇద్దరు మాత్రమే డ్యూటీలు చేస్తున్నారనీ అన్నారు. నలుగురు ఆపరేటర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ సమావేశం కూన రాజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సర్వీస్ రూల్స్ ఆర్టిజన్ కార్మికులకు వర్తింపు చేయాలనీ డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో కార్మికులందరికీ ఒకే రూల్ అమలు చేయాలని అన్నారు. ఆర్టిజన్ జేఏసీకి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని బ్రహ్మచారీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యుఈఈయు కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి పులి గణేష్ బాబు, అధ్యక్షులు జి వెంకన్న, జి. రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు, శరత్ ,పూర్ణిమ, గ్లోరీ, వెంకటేశ్వర్లు, బానోతు రవి ఆర్టిజన్ లు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన ఆర్టిజన్ జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. జె ఎ సి చైర్మన్ గా కూనరాజు శ్రీనివాస్, కన్వీనర్ గా బుడిగ రమేష్, కో చైర్మన్లుగా బి. మోతిరాం , డి. శరత్, కో కన్వీనర్లుగా బానోతు రవి, బి. అశోక్, ఎస్. గ్లోరీ, జాయింట్ సెక్రెటరిగా ఎం. రాము, కె. కోటి, జి .వెంకటేశ్వర్లు పి. పూర్ణిమ, యాసం ప్రసాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి . స్వప్న, సూరిశెట్టి ప్రసాద్, బానోతు రాంబాబు, ఎస్. విష్ణు, కె. చంద్రశేఖర్, కోశాధికారిగా బి. కుమార్ లను ఎన్నుకున్నారు.



## గణేష్ మండపాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యువ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిగాయి.యాదగిరిగుట్ట బీసీ కాలని గణపతి మండపం వద్ద కూచిపూడి నృత్యం భరతనాట్యం చిన్నారుల సందడి చేసిన ఏలూరి యామిని . మెరుగు సిరి చందన. దొమ్మాట వర్షిని.మెరుగు పూజిత మహా భారతం . సత్య భామ.జై గణేష సాంగ్ అమ్మాలా నటనతో ఆకట్టుకున్న నృత్యాలు అందరినీ అలరించారు.చిన్నారులను యువ భారత్ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెరుగు మధు.దండ్ల బాల నరసింహ.దొమ్మాట భాస్కర్ పాల్గొన్నారు.



## సీసీసి ఆఫీసు నుండే "సి నెట్" సేవలు..

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి) రాజమహేంద్రవరం లో ఇప్పటికే తన సేవలను అందిస్తున్న "సి నెట్" ఆదివారం నుంచి తన సేవలను దనవాయి పేట లోని సీసీసి ఆఫీసునుండి అందించనుంది.ప్రస్తుత పోటీ వ్యాపారానికి ధీటుగా తక్కువ ధరలకే ఎక్కువ స్పీడుతో తన నాణ్యమైన సేవలను వినియోగదారులకు అందించనుంది.ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పంతం కొండలరావు ఆదివారం ఉదయం పూజ అనంతరం స్విచ్ ఆన్ చేసి నెట్ సేవలు ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో వంక రెజేంద్ర,నండూరి సుబ్బారావు,వాకచర్ల కృష్ణ, రవికుమార్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురం సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా రాయల శ్రీనివాసరావు

### దేశంలో నియంత పరిపాలన సాగుతుంది
### సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు - బండారు రమేష్



ముదిగొండ మండలం సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : సి.పి.ఎం వెంకటాపురం గ్రామశాఖ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు.. వెంకటాపురం గ్రామములోని బీసీ కాలనీ నందు కందుల భాస్కర్ రావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సభలో సి.పి.ఎం జిల్లా కమిటి సభ్యులు బండారు రమేష్ మాట్లాడుతూ దేశంలో నియంత పరిపాలన సాగుతుంది అని కార్పొరేట్ల కనుసన్నలలో ప్రదాని మోడీ పనిచేస్తున్నారని రాబోవు కాలంలో దేశంలో జమిలి ఎన్నికలు తీసుకరావాలని ప్రదాని అంటున్నారని. దీనివలన ఫెడరల్ స్పూర్తి దెబ్బతింటుందని రాష్ట్రాల అధికారాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఇంకా ఈ సభలో 1)సాగర్ కాల్వ గండి వెంటనే పూడ్చాలని, రైతుల పంట పొలాలకు నీరు అందించాలని 2) ఖమ్మం నుండి కోదాడ రహదారి శాశ్వత (రిపేరు) పరిష్కారం చేయాలని 3) రైతు రుణమాఫీ 200,000/ వరకు మాఫీ చేయాలని తీర్మానం చేసారు.ఈ సభలో పార్టీ జిల్లా కమిటి సభ్యులు వాసిరెడ్డి వర ప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల కమిటి సభ్యులు కందుల భాస్కర్ రావు, మందరవు వెంకన్న, మందరపు పద్మ, కోలేటి ఉపేందర్ రావు, భద్రయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జనం

### లడ్డూ వేలం పాటలో 46000వేలకు మహా ప్రసాదం లడ్డూను కైవసం చేసుకున్న చింతల సత్యనారాయణ దంపతులు

వాయిస్ టుడే/ (గుమ్మడిదల మండల ప్రతినిధి సంగారెడ్డి జిల్లా): గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘం గణేష్ మండపం వద్ద లడ్డు వేలం పాట హోరాహోరీగా సాగింది..46000 వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్న చింతల సత్యనారాయణ దంపతులు.. కమిటీ సభ్యులు చింతల వీరేష్ దంపతులు లకు శాలువాతో ఘనంగా సన్మానించి మహా ప్రసాదం లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు చింతల రామకృష్ణ మంగయ్య విష్ణు చింతల సుధాకర్ పలాటి నర్సింగ్ రావు సార ప్రభాకర్ చింతల శ్రీనివాస్ చింతల వెంకటేష్ చింతల కృష్ణ చింతల నాగరాజ్ చింతలభద్రయ్య పలాటి వెంకటేష్ చింతల శ్రీశైలం చింతల మధు చింతల మహేందర్ సారా శంకర్ అతిథులుగా స్వేచ్ఛ రెడ్డి రాజిరెడ్డి మంగలి కిషోర్ కాలనీవాసులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు యధావిధిగా "పీజీఆర్ఎస్ 'మీ కోసం"

### - జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రతి సోమవారం నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమం యధావిధిగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి వెల్లడించారు.ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సెప్టెంబరు 23 వ తేదీన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 23 సోమవారం పి జి ఆర్ ఎస్ - మీ కోసం ద్వారా ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, రెవెన్యు డివిజనల్ , మునిసిపల్, మండల స్థాయిలో "మీ కోసం" కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు డివిజన్ పరిధిలో రెవిన్యూ డివిజనల్ అధికారులకి, మునిసిపల్ కమిషనర్లకు, తహసిల్దార్, ఎంపిడివో, ప్రత్యేక అధికారులకు, ఇతర మండల స్థాయి అధికారులకి అందచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## అక్టోబర్ 20న జరిగే మహాసభను విజయవంతం చేయండి

### వర్గీకరణ వ్యతిరేక బహిరంగ సభకు సన్నాహక సమావేశం
### మాలమహానాడు నాయకులు



వాయిస్ టుడే, కాజీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల అక్టోబర్ 20వ తేదీన హనుమకొండలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కాజీపేటలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం (శివాలయం) మినీ హాల్ లో తేజోమయి మాల కులసంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మార్యాల కృష్ణ మరియు బండి విజయ్ కుమార్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, రిటైర్డ్ డిఎస్పీ దామెర నర్సయ్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, కానీ కులాల ప్రాతిపదికన పూర్తిగా పరిశీలన జరిపిన తర్వాతే తుది తీర్పు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక వర్గం వైపే మొగ్గు చూపుతున్న తీరు బాధాకరమని, ఇది మాలల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని పేర్కొన్నారు. ఈ తీర్పు అన్యాయంగా ఉందని, మాలల వర్గీకరణకు హాని కలిగించే విధంగా తీర్పు ఉన్నందున దీనిపై మళ్లీ పున:పరిశీలన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

మాలలు అనేక సమస్యలను సరిదిద్దేందుకు ఎస్సీ వర్గీకరణపై చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీని ప్రభావం కేవలం కులవ్యవస్థపైనే కాకుండా సమాజంలోని సామాజిక న్యాయం మరియు సమానత్వంపై ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిష్కారం పొందాలంటే ప్రజలు ఒకతాటిపైకి రావాలని, విభజనకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల అక్టోబర్ 20న హనుమకొండలో జరిగే సభకు పెద్దఎత్తున ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సభ ద్వారా మాలల సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి సవివరంగా తెలియజేయాలని, ప్రజల ఆవేదనను బలంగా వినిపించాలని సంకల్పించారు. ఈ సమావేశంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కోంద్ర నర్సింగరావు, నక్క సుదర్శన్, సిహెచ్ కొమ్మాలు, ఈసారపు సత్యనారాయణ, గూడెం కుమార్ స్వామి, జంగం బాబురావు, పప్పుల గోవర్ధన్, బొట్టు రాజు, అంకేశ్వరపు రామచందర్, దాసరి రాజేశ్వరరావు, అల్వాల అనిల్ కుమార్, తండమల్ల వేణు, కొత్త రవి, మైలారపు శంకర్, జానపట్ల యాదగిరి, బరబరి నర్సింగరావు, బండారి రాజేందర్, బాదాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన కేంద్ర మంత్రి కురియన్



వాయిస్ టుడే, ఉమ్మడి వరంగల్ జిల్లా: బిజెపి సంస్థాగత పర్యటనలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, ఫిషరీస్, మరియు మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఆదివారం ఉదయం కాజీపేట ఫాతిమానగర్‌లోని క్యాథడ్రాల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి స్వయంగా ప్రార్థన చేశారు. అనంతరం భారతీయ రోమన్ కాథలిక్ పీఠాధిపతి, వరంగల్ బిషప్ డా. ఉడుముల బాల, చర్చి ఫాదర్ కాసుమార్రెడ్డి, కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ని శాలువతో సత్కరించారు. చర్చి కౌన్సిల్ ప్రెసిడెంట్ దయాసాగర్, సెక్రటరీ టామీ మరియు కౌన్సిల్ సభ్యులు కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బిజెపి జిల్లా నాయకులు డి.అమర్నాథ్ రెడ్డి, కందగట్ల సత్యనారయణ, తోపుచేర్ల మధుసుధన్ రావు, గాదె రాంబాబు, మామిడాల నరేందర్, బండి భాస్కర్, బత్తుల వినయ్, జన్ను మధు, చర్చి కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కోదండరాం సార్‌ను సన్మానించిన మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు నర్సాగౌడ్

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని రిటైడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనంలో తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా తెలంగాణ ఉద్యమ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎంఎల్సీ ప్రో కోదండరాం సార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు తెలంగాణ ఉద్యమ నాయకులు అమరవేణి నర్సాగౌడ్, నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనుముల భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సభలో తెలంగాణ ఉద్యమ కారుల పక్షాన కోదండరాం సార్ ను అమరవేణి నర్సాగౌడ్, అనుముల భాస్కర్ తదితరులు శాలువాలతో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.

# దులీప్ ట్రోఫీ విజేత ఇండియా – ఏ

**రన్నర్స్‌గా ఇండియా – సీ**

**రిక్కీ భుయ్ అజేయ సెంచరీ**

**సాయి సుదర్శన్ సెంచరీవృథా..**

**ముగిసిన దులీఫ్ ట్రోఫీ**

**దులీప్ ట్రోఫీ విజేత జట్టుకు కప్ అందజేసిన ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు**

**కప్ ను అందజేసిన మంత్రి పయ్యావుల కేశవ్**

**చెక్కులు అందజేసిన ఆర్డీటి ప్రోగ్రాం డైరెక్టర్ మాం చొ ఫెర్రర్**




అనంతపురం, సెప్టెంబర్ 22 : వాయిస్ టుడే : దులీఫ్ ట్రోఫీను ఇండియా- ఏ జట్టు కైవసం చేసుకుంది. టోర్నీలో 12 పాయింట్లతో ఇండియా- ఏ జట్టు అగ్రస్థానంలో నిలిచి టోర్నీ విజేతగా నిలిచింది. 9 పాయింట్లతో ఇండియా–సీ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ "విలేజ్‌లో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇండియా ఏ జట్టు 132 పరుగులతో ఇండియా సీ జట్టుపై, ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో ఇండియా–బీ జట్టుపై విజయం సాధించాయి. ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా డీ బ్యాట్స్‌మెన్ అజేయ శతకం చేసిన రిక్కీభుయ్ (56, 119) అర్ధ సెంచరీ, సెంచరీ చేసి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారుడు సాయిసుదర్శన్ సెంచరీ సాధించాడు. ఇండియా సీ–తో జరిగిన మ్యాచ్‌లో ఏ జట్టు క్రీడాకారుడు శాశ్వత్ రావత్ (124, 53) సెంచరీ, అర్ధసెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా సీ జట్టు క్రీడాకారులు అన్షుల్ కాంబోజ్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా(16 వికెట్లు, 41 పరుగులు) నిలిచాడు. టోర్నీ విజేత ఇండియా–ఏ జట్టుకు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు విన్నర్స్ కప్‌ను అందజేశారు. రన్నర్స్‌కు రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిపయ్యావుల కేశవ్ కప్‌ను అందజేశారు. స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్‌కు మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బి గ్రౌండ్‌లో ఏసీఏ అతిథి ఆర్.వి.ఎస్.కె. రంగారావ్ క్రీడాకారులకు చెక్కులను అందజేశారు.

**రిక్కీ భుయ్ అజేయ శతకం..**
**ఇండియా డీ భారీ విజయం:**

ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా డీ జట్టు భారీ విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 244/5తో ప్రారంభించిన ఇండియా డీ జట్టు 305 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తెలుగుతేజం రిక్కీభుయ్ అజేయ శతకం సాధించాడు. టోర్నీలో రిక్కీ భుయ్ రెండో సెంచరీ ఇది. చివరి మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లోనూ రిక్కీభుయ్ అర్ధ సెంచరీ సాధించిన విషయం విధితమే. 124 బంతులు ఎదుర్కొన్న రిక్కీ భుయ్ 15 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో 119 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో ఇండియా డీ జట్టు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకుని ఇండియా బీ జట్టు ముందు 373 పరుగల లక్ష్యాన్ని ఉంచింది.

**అర్ష్‌దీప్, థాకరే ధాటికి**
**బీ జట్టు 115 పరుగులకు ఆలౌట్:**

373 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన ఇండియా బీ జట్టు..ఇండియా డీ జట్టు బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాకరే ధాటికి విలవిల్లాడింది. వీరిద్దరూ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బీ జట్టుప విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ సింగ్ 11.2 ఓవర్లలో 40 పరుగులిచ్చి 6 వికెట్లు, ఆదిత్య థాకరే 11 ఓవర్లలో 59 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. దీంతో ఇండియా బీ జట్టు 22.2 ఓవర్లలో కేవలం 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో బీ జట్టుపై గెలుపొందింది.

**సాయిసుదర్శన్ సెంచరీ వృథా..**
**ఇండియా ఏ జట్టు విజయం:**

ఇండియా ఏతో జరిగిన మ్యాచ్‌లో సీ జట్టు క్రీడాకారులు సాయి సుదర్శన్ సెంచరీ వృథా అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 270/6తో ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో 16 పరుగులు జోడించి డిక్లేర్డ్ చేసింది. దీంతో ఇండియా సీ జట్టు ముందు 350 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. భారీ పరుగుల చేధనలో ఏ బౌలర్ల ధాటికి సీ జట్టు క్రీడాకారులు నిలువలేకపోయారు. 81.5 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయ్యింది ఇండియా సీ జట్టు. ఆ జట్టులో సాయిసుదర్శన్ ఒంటిరి పోరాటం చేశాడు. 206 బంతుల్లో 12 బౌండరీల సహాయంతో సాయిసుదర్శన్ 111 పరుగులు చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44(5 ఫోర్లు)

వైశాక్ 17, ఇషాన్ కిషన్17 మినహా మిగితా వారు రెండంకెల స్కోర్ కూడా దాటలేకపోయారు. ఇండియా ఏ జట్టు బౌలర్లలో ప్రసిద్ద్‌కృష్ణ 3, తనుష్ కొటియన్ 3, అకీబ్‌ఖాన్2, సామ్స్ ములానీ వికెట్ తీసుకున్నారు. దీంతో ఇండియా ఏ జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో ఏసీఏ కౌన్సిలర్ డి.గౌర్ విష్ణు, గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణ విద్య కరాటేపై దృష్టి సాధించాలి

**జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కార్తికేయ ను సన్మానించిన ఝాన్సీరెడ్డి**



తొర్రూర్ సెప్టెంబర్ 22 వాయిస్ టూడే: నవంబర్ లో గోవా లో జరిగే జాతీయ కరాటే పోటీ ల కు ఎంపికైన నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామ నివాసి ఆకుతోట కార్తికేయ ను ఆదివారం డివిజన్ కేంద్రం లో జరిగిన స్టేట్ లెవెల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీ లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన ఆకుతోట కార్తికేయ ను పాలకుర్తి నియోజక వర్గ ఇంఛార్జ్ ఝాన్సీరెడ్డి అభినందించారు.తాజ గా వరంగల్ లో తొమ్మిదవ జాతీయస్థాయి షోటో కాన్ కరాటే ఛాంపియన్ షిప్–2024 పోటీ లు జరిగాయి.నెల్లికుదురు మండలాని కి చెందిన ఆకుతోట కార్తికేయ ఈ పోటీ ల లో ఆరెంజ్ బెల్ట్ కట్ ఆఫ్ విభాగం లో ప్రతిభ కన బరిచి గోల్డ్ మెడల్ సాధించాడు.ప్రతిభ కన బరిచిన విద్యార్థి ని,కోచ్ యాకూబ్ పాషను ఝాన్సీరెడ్డి–అభినందించారు.ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.,ఆత్మ రక్షణ కు కరాటే విద్య దోహద పడుతుందని,పాఠశాల స్థాయి నుంచే కరాటే పై శిక్షణ అవసరమని తెలియ చేశారు.కరాటే లో కార్తికేయ రాణించడం గర్వ కారణం అని తెలియ చేశారు.గోవా లో జరిగే జాతీయ పోటీ ల లో రాణించి జిల్లా కు మంచి పేరు తీసుక రావాలని కోరారు.





## కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పురమల్ల శ్రీనివాస్

**లోయర్ మానేరు డ్యాం ముంపు బాధితుల వినతి**

కరీంనగర్ సెప్టెంబర్ 22(వాయిస్ టుడే)లోయర్ మానేరు డ్యాం ముంపు గ్రామాల బాధితులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పురమల్ల శ్రీనివాస్ కలిసి తమకు జీవో 98 ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా తగు చొరవ తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. జి.వో.98, తేది : 15.04.1986 ప్రకారం ఇప్పటి వరకు ముంపు బాధిత కుటుంబాలకు ఇరిగేషన్ శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, తమకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని గోడును వెల్లబోసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అధికారులకు, జిల్లా కలెక్టర్కు దరఖాస్తులు ఇచ్చామని, ఇప్పటి వరకు మాకు న్యాయం జరగలేదని చెప్పారు. ఇటీవల జలసౌధలో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి ఇరిగేషన్ శాఖలో1800 లస్కర్ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి కోసం పంపించినట్లు పలు పత్రికలలో వచ్చిన కథనాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాగా స్పందించిన పురమల్ల శ్రీనివాస్ ఇట్టి విషయాన్ని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ముంపు బాధితులకు ఉద్యోగాలు కల్పించేలా తగు చొరవ తీసుకుంటానని హామి ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వరాల శ్రీనివాస్, గసికంటి అనిల్, టి.వి స్వామి, వెన్నం వేణు, జెల్ల సతీష్, లక్ష్మణ్, రాజు, చిరంజీవి, చందు, లోయర్ మానేరు ముంపు గ్రామాల బాధితులు పాల్గొన్నారు.

# క్రీడలపై ఆసక్తి పెంపొందించు కోవాలి

**తొర్రూర్ సిఐ జగదీష్**



తొర్రూర్ సెప్టెంబర్ 22 వాయిస్ టూడే: మానసిక ఉల్లాసాని కి క్రీడ లు దోహద పడతాయని క్రీడలపై ఆసక్తి పెంపొదించు కోవాలని తొర్రూర్ సిఐ జగదీష్ అన్నారు.తొర్రూర్ సర్కిల్ పోలీస్, తొర్రూర్ ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల తో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను తొర్రూర్ సర్కిల్ పోలీస్ ఆధ్వర్యం లో యతిరాజారావు పార్క్ (స్టేడియం) లో నిర్వహించారు.ఈ సందర్భం గా టికెట్ క్రీడ ల ను ప్రారంభించి టిడబ్ల్యూజె (ఐజెయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్,శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి ల తో కలిసి సిఐ జగదీష్ మాట్లాడుతూ.,క్రీడలతో స్నేహ భావం పెంపొందిస్తాయని,ప్రతి ఒక్కరు వారి వీధి నిర్వహణ తో పాటు క్రీడ ల లో రాణించాలన్నారు.క్రీడల ద్వారా క్రమ శిక్షణ అలవడుతుందన్నారు.క్రీడ ల లో గెలుపు–ఓటము లు సహజమని,క్రీడ పోటీ ల నిర్వహణ కు సంపూర్ణ సహకారం–అందిస్తామన్నారు.ఈ క్రికెట్ పోటీ లో తొర్రూర్ సర్కిల్ పోలీస్ టీం విజయం సాధించారు.ఈ క్రీడలలో సిక్స్‌లు కొట్టిన ముగ్గురి కి మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ నర్సూటి గజానంద్ రూ.516 చొప్పున నగదు అంద జేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లు ఉపేందర్, పి.రాజు,రమేష్–బాబు, క్రాంతికిరణ్, సురేష్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు నాగపురి అశోక్ గౌడ్, వెంకటరమణ, కృష్ణప్రసాద్, నారాయణరాజు, వినోద్ రెడ్డి, సదాశివరావు, శ్రీనివాస్, యాదగిరినాయక్, సాంబశివ, రాంబాబు, ఆకుతోట.యాకన్న, శ్రీకాంత్, సంతోష్, భాస్కర్, వీరన్న, సురేష్, అమీర్, మహేష్, ఆంజనేయులు, రాజు, నిమ్మల.రవి, మనోహరస్వామి, రాజేందర్, శ్రీనివాస్,కార్తీక్,శేఖర్,పోలీస్‌లు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ తొర్రూర్ మండల అధ్యక్షునిగా విప్లవ్‌రెడ్డి





తొర్రూరు, సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : ప్రోగ్రెసివ్ రిక గ్నైజ్డ్ టీచర్స్ యూనియన్–తెలంగాణ స్టేట్ (పీఆర్టీయు–టీఎస్) తొర్రూరు మండల శాఖ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకా బద్రి నారాయణ, మిర్యాల సతీష్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని లయన్స్ భవన్ లో నిర్వహించిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షుడిగా జినుగ విప్లవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పులి ముత్తిలింగం అసోసియేట్ అధ్యక్షుడిగా కె. వసుందర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా నాయిని అనుపమ, కార్యదర్శి గా మహ్మద్ రంజాన్ మహిళా కార్యదర్శి గా సి హెచ్ స్వప్న లను ఎన్నుకున్నారు.ఎలక్షన్ అధికారులు గా గంగిశెట్టి రమేష్ కుమార్, వెలిదే సురేష్ కుమార్ వ్యవహరించారు సమావేశంలో రాష్ట్ర, జిల్లా ,మండల బాధ్యులు బాధ్యులు చీకటి వెంకన్న, దుబ్బాక శ్రీధర్ రెడ్డి, మద్ది లింగమూర్తి, భూసాని సోమయ్య, కె ప్రభాకర్, కె రవీందర్, ఆ.జయపాల్ రెడ్డి, ఎండ్.యాకూబ్ అలీ, వజినేపల్లి రమేష్, జి శ్రీనివాస్, కె అశోక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బి వెంకటేశ్వర రావు,ప్రక్క మండలాల బాధ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

**సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్**

తొర్రూరు, సెప్టెంబర్ 22 వాయిస్ టుడే : ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తొర్రూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహాసభల సూచికగా పార్టీ జెండాను పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం పార్టీ కార్యాలయంలో పట్టణ మహాసభ కొమ్మనబోయిన యాకయ్య, బొల్ల%శీ% మమత ల అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ముఖ్యఅతిథిగా బొల్లం అశోక్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీ గాలికి వదిలేసారని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర హామీని తక్షణమే అమలు చేయాలని వారు కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్నారు. ఇవ్వాలని అలాగే ఉపాధి కూలీలకు రోజు వేతనం 400, పేద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. పట్టణ కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని రెండు శాఖల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మొదటి శాఖ కార్యదర్శిగా జమ్ముల శ్రీనివాస్ రెండవ శాఖ కార్యదర్శిగా బొల్లం మమతలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల కార్యదర్శి ఎండి యాకూబ్ ప్రకటించారు. ఈ సమావేశంలో సిపిఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకూబ్, మండల నాయకులు మర్క సాంబయ్య, దొనుక దర్గయ్య, ఉమ్మ గాని యాకయ్య, దొమ్మటి సోమయ్య, పొడగంటి ఎల్లమ్మ, పల్లె వెంకటేశ్వర్లు, జిగిజర్ల శ్రీను, యనమల క్రాంతి కుమార్, కిన్నెర నగేష్, రామకృష్ణ, నవీన్ బాబు, ప్రమీల, శైలజ, తదితరులు పాల్గొన్నారు.




## గౌడ కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

**శ్రీ కంఠమహేశ్వర గౌడ సంఘం అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్**

తొర్రూర్ సెప్టెంబర్ 22 వాయిస్ టూడే: గౌడ కులస్తుల సంక్షేమం,అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేయాలని తొర్రూర్ శ్రీ కంఠమహేశ్వర గౌడ సంఘం అధ్యక్షుడు నిమ్మల శేఖర్ గౌడ్ కోరారు.ఆదివారం తొర్రూర్ పట్టణ కేంద్రం లోని అమ్మాపురము రోడ్ లో గల డబుల్ బెడ్ రూమ్ గ్రౌండ్ లో ఆదివారం శ్రీ కంఠమహేశ్వరగౌడ పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనం గా నిర్వహించారు.సంఘ గౌర అధ్యక్షుడు చీకటి రమేష్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా నిమ్మల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.,గౌడ కులస్తుల అభివృద్ధి కి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.అర్హులైన కల్లు గీత కార్మికుల కు ప్రత్యేక సబ్సిడీ లోన్ ల తో పాటు ప్రమాద బీమా,ఎక్స్ గ్రేషియా కల్పించాలన్నారు.గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.,గౌడ కులస్తుల కు కమ్యూనిటీ భవనాల నిర్మాణాల కు ప్రత్యేక చొరవ చూప గలరు.సంఘం ఆధ్వర్యం లో నిరు పేద విద్యార్థుల కు స్కాలర్ షిప్స్ అందించడం పాటు అనారోగ్యాని కి గురైన గీత కార్మికుల కు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలియ చేశారు.అనంతరం అధ్యక్ష కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఘనం గా సన్మానించారు. కార్యక్రమం లో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, నాగపురి అశోక్ గౌడ్, దీకొండ.శ్రీనివాస్, రావుల.యాదగిరిగౌడ్, బొమ్మగాని.ఓంప్రకాష్, కోశాధికారి–జనగం.రామ్మూర్తిగౌడ్, బొలగాని.ఉప్పలయ్య, ఐలయ్య, బొమ్మగాని.యాకయ్య, నిమ్మల.రవి, చీకటి.శంకరయ్య, బండి.యాకయ్య, నిమ్మల.యాకన్నగౌడ్, పెద్ది.సతీష్, శంకర్, దొరపల్లి. రాజేష్, రామచంద్రయ్య, జలగం.రవీందర్,గౌడ్,జలగం.స్వామి,శంకర్,కమిటీ–సభ్యులు,తదితరులు,పాల్గొన్నారు.

## గన్నేరువరం చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేయాలి



కరీంనగర్ సెప్టెంబర్ 22(వాయిస్ టుడే)గన్నేరువరం గ్రామంలో ఊరి చెరువు వద్ద బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెల జగన్మోహన్ పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గన్నేరువరం చెరువు కట్టను సుందరీకరించి, నడక మార్గం ఏర్పాటు చేసి, బతుకమ్మ ఘాటును నిర్మించి, మినీ ట్యాంక్ బండ్ ను ఏర్పాటు చేయాలని కోరారు. కాంతాల అంజిరెడ్డి మాట్లాడుతూ గన్నేరువరం చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లెల జగన్ మోహన్, కాంతాల అంజిరెడ్డి, కొట్టె భూమయ్య, గొల్లపల్లి రవి కొట్టె నర్సయ్య పుల్లెల రాము, బొడ్డు రాకేష్ దొగ్గలి రాజు కయ్యం శ్రీకాంత్ కొలుపుల అనిల్ మంగలారపు కృష్ణకాంత్, బొమ్మ శ్రీను మంగలారపు సాయి సందనవేణి ఐలయ్య బోయిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టిన కరీంనగర్ టౌన్ వన్ బిజెపి ఇన్చార్జి , కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్

కరీంనగర్ సెప్టెంబర్ 22(వాయిస్ టుడే)బిజెపి జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం రోజున కరీంనగర్ టౌన్ (1) పరిధిలోని 30 డివిజన్ లలో ఇన్చార్జి , కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఆయా డివిజన్ పరిధిలోని బిజెపి ముఖ్య నేతలతో ఇన్చార్జి, కార్పొరేటర్ శ్రీనివాస్ కలిసి మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ జన సంఘ్ నుండి ఇప్పటివరకు బిజెపి దేశంలో కొత్త రాజకీయ సంస్కృతిని తీసుకురావడానికి ఎంతో కృషి చేసిందన్నారు. బిజెపి నిరంతరం సామాన్య ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే దిశగా రాజకీయ ప్రయాణం కొనసాగిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చేపట్టిన సభ్యత్వ డ్రైవ్ కుటుంబ విస్తరణ లాంటిదన్నారు. ప్రజలు బిజెపి పట్ల విశ్వాసంతో ఉన్నారని, అందుకే స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, నూతన సభ్యత్వాలు పెద్ద మొత్తంలో జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ కటకం లోకేష్ మరియు సభ్యత నమోదు కో కోఆర్డినేటర్లు కైలాస నవీన్, బోయిని శ్రీనివాస్, కొమర రవీందర్ రెడ్డి మరియు గాండ్ల నరేష్, వరాల దేవేందర్, శివరాత్రి శేఖర్, కన్నం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

హుజూరాబాద్ సెప్టెంబర్ 22 (వాయిస్ టుడే): ఆదివారం రోజున జనవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో చెల్పూర్ మరియు తొకలపల్లి గ్రామాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన ఈ శిబిరం లో హన్మకొండ కి చెందిన ఏకశిలా మరియు లక్ష్మీనరసింహ హాస్పిటల్ వైద్య బృందం డా.తేజ ఎం బి బి ఎస్ గైనకాలజిస్ట్, అలాగే కార్డియాలజీ, న్యూరాలాజీ, పల్మనలజీ, చెస్ట్ వైద్యులు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఐ స్పెషలిస్ట్ లో చేత దాదాపు 300 లకు పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యొక్క 37 మంది సిబ్బంది, సూపర్వైజర్ లు , జనవికాస హుజూరాబాద్ సెంటర్ మేనేజర్ ఎం డి ఖాజా బీ, కో ఆర్డినేటర్ లు లీల, రజిత, గ్రామ కార్యదర్శి , బిల్ కలెక్టర్ లు పాల్గొన్నారు.




## 58 డివిజన్లో స్వచ్ఛత హీ సేవపై అవగాహన

కరీంనగర్ సెప్టెంబర్ 22(వాయిస్ టుడే)కరీంనగర్ నగరపాలక సంస్థ 58వ డివిజన్ లో స్వచ్ఛతా హి సేవ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, స్థానిక ప్రజల తో మీటింగ్ ఏర్పాటు చేసి పారిశుధ్యం పై ప్రతిజ్ఞ చేయించారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ రాపర్తి విజయ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ నిజం చేసేలా ప్రజలు పునరంకితం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా ప్రజల్ని ప్రోత్సహించేందుకు అక్టోబర్ 2, 2015 న స్వచ్ఛతా సేవను ప్రధాని మోడీ ప్రారంభించారని తెలిపారు. అపరిశుభ్రత నుంచి ఆరోగ్యభారతాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఒంటరిగా ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని సాధించలేదని , ఇందుకోసం ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.



## బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

వాయిస్ టుడే ,ఎండ పల్లి : ఎండ పల్లి మండలంలోని గుల్ల కోట గ్రామంలో లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు విచ్చేసి బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయ వంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షులు రావు హనుమంతరావు , ఓ బి సి మోర్చా అధ్యక్షులు అమరగొండ దివాకర్, మండల ప్రధాన కార్యదర్శి పొన్నం నరేష్, గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నం కిరణ్ ,బూత్ అధ్యక్షులు మెరుగు తిరుపతి, బాయి గారి సాయికిరణ్ ,బుర్ర శ్రావణ్ ,గొల్లపల్లి అంజి, యూత్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి రామ్ చరణ్ ,పెంజర్ల మనోజ్ బాయి గారి అర్జున్ , బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

**ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ**

**ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మధుసూదన్**




వరంగల్ ( వాయిస్ టుడే) సెప్టెంబర్ 22 : ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థేనని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మధుసూదన్ అన్నారు. వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఉర్సు గుట్ట వద్ద గల జెఎస్ఎం స్కూల్ లో ఆదివారం జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రేరణ-6.0 (వృత్యంతర శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మధుసూదన్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధించే అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎస్ ఇ ఆర్ టి కి చెందిన టెక్స్ట్ బుక్స్ కో-ఆర్డినేటర్ సువర్ణ వినాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ చక్రవర్తుల శ్రీనివాస్ (తెలుగు), ఎండి గౌస్ (హిందీ), రఘురాం (ఇంగ్లీష్), కందాల రామయ్య (గణితం), శ్రీనివాసచారి (భౌతిక శాస్త్రం), మధుసూదన్ రెడ్డి (జీవశాస్త్రం), రతంగ పాణి (సాంఘిక శాస్త్రం) లు చక్కని శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ పాఠాలు బోధించే ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూదన్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం శిక్షణ పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ రిటైర్డ్ ఎంఈఓ బ్రహ్మయ్య కూడా ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణలో కూర్చుని వినడం అద్భుతం అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు మాట్లాడుతూ టీచర్లు బాగుంటే పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఇది ప్రైవేటు పాఠశాలల మీద గురుతర బాధ్యత ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రైవేట్ పాఠశాలల గొప్పతనం గురించి చెప్పడం సంతోషం అన్నారు. ఈ సమావేశంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు, కోశాధికారి పి రాఘవేందర్ రెడ్డి, సలహాదారులు ఎన్ నారాయణరెడ్డి, కె భూపాల్ రావు, జిల్లా అధ్యక్షులు సిహెచ్ నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, కోశాధికారి డి రామ్మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాసం సూర్యనారాయణ, రాష్ట్ర, జిల్లా కమిటీల బాధ్యులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర ప్రసాదం.... కల్తీ మయం

**శ్రీవారి లడ్డూ ప్రసాద పవిత్రత .. గోవిందా... గోవిందా...**



కోట్లాది మంది హిందువులకు పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానమని, తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం వారికి ఎంతో పవిత్రంగా అమృతంతో సమానమని, అలాంటిది తిరుమల చరిత్రలో మొట్ట మొదటిసారిగా పవిత్రమైన లడ్డు ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వుతో పాటు, కల్తీ నెయ్యి, చేప నూనెలను వినియోగించడం చాలా దారుణమని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది, సైకాలజిస్ట్ దయాల ఓంప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని భక్తులు అత్యంత భక్తితో కళ్ళకు అద్దుకొని స్వీకరించినప్పుడు కలిగే తన్మయత్వం వర్ణానాతీతమని, అంతటి పవిత్రమైన లడ్డు ప్రసాదం కల్తీకి గురికావడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. రమణ దీక్షలు సైతం తిరుమల లడ్డు ప్రసాదం నాణ్యత విషయంలో గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సైతం ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారని ఈ సందర్భంగా ఓం ప్రసాద్ గుర్తు చేశారు.

25 రూపాయలు ఉన్న లడ్డును గత ప్రభుత్వం 50కి పెంచిందని, అయినప్పటికీ లడ్డు నాణ్యతలో రాజీపడడం దారుణమని, ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమే అవుతుందన్నారు. ధర పెంచితే నాణ్యత పెంచాల్సింది పోయి, పైగా కల్తీ చేయడం అత్యంత ఏహ్యమైన చర్య అని దుయ్యబట్టారు. ఈవిషయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఓంప్రసాద్ కోరారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

టేకులపల్లి: ప్రమాదవశాత్తు వాగు ఉద్ధృతిలో కొట్టుకపోతున్న కారును కాపాడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సుజాతనగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన కొమరం బుచ్చయ్య తన కారులో టేకులపల్లి మీదుగా హైదరాబాద్ బయలుదేరారు. తూర్పుగూడెం దగ్గర వంతెన చప్టాపై నుంచి రాళ్లవాగు ప్రవహిస్తోంది. దాని ఉద్ధృతిని అంచనా వేయలేక, బుచ్చయ్య దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కారు పక్కకు జారింది. వెంటనే అప్రమత్తమై కిందకు దిగిన సమ్మయ్య సమీప వాసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని కారును బయటకు లాగారు. పది రోజుల క్రితమే ఇదే వాగులో కొట్టుకుపోతున్న ఓ వ్యక్తిని కూడా స్థానికులు రక్షించారు. తూర్పుగూడెం వద్ద వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు.



## తిరుపతి లడ్డూలో.. పొగాకు పదార్థం కనిపించిందంటూ వైరల్?



ఖమ్మం గ్రామీణం: ఇప్పటికే తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయంలోని లడ్డూ నాణ్యతపై వివాదం కొనసాగుతోంది. ఇదే సమయంలో ఓ ఘటన సామాజిక మాధ్యమాల్లో ఆదివారం వైరల్ అయింది. ఖమ్మం గ్రామీణం మండలంలోని ఓ కుటుంబానికి చెందిన భక్తులు ఈ నెల 19న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. స్వామివారి క్షేత్రంలో కొనుగోలు చేసి తెచ్చిన లడ్డూలను ఆదివారం ఉదయం బంధువులకు పంచేందుకు చూడగా.. వాటిల్లో ఒకదాంట్లో నమిలే పొగాకు వంటి పదార్థం కనిపించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ దృశ్యాలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.



## మాధవనగర్ ఆర్వోబీ పనులు చకచకా

డిచ్‌పల్లి గ్రామీణం : నిజామాబాద్ – హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మాధవనగర్ వద్ద రైళ్ల రాకపోకలతో రైల్వే గేటు తరచూ వేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు పట్టాలకు ఇరువైపులా చేపట్టిన పై వంతెన(ఆర్వోబీ) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తికాగా.. ప్రస్తుతం మాధవనగర్ సాయిబాబా ఆలయంవైపు స్లాబు పనులు ప్రారంభమయ్యాయి. త్వరగా పూర్తిచేస్తామని అధికారులు అంటున్నారు.

## జడ్చర్ల తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

జడ్చర్ల: భూదాన్ భూమి వ్యవహారంపై విచారణకు హాజరుకాకపోవడంతో జడ్చర్ల తహసీల్దారు సత్యనారాయణరెడ్డిని సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు సంబంధించిన భూధాన్ భూవివాదంపై శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయంలో నిర్వహించిన విచారణకు దస్త్రాలు, పూర్తిస్థాయి వివరాలతో తహసీల్దారు సత్యనారాయణరెడ్డి హాజరుకావల్సి ఉండగా వెళ్లలేదు. అతడికి బదులుగా ఉప తహసీల్దారు రాజీవ్‌రెడ్డిని పంపించారు. విధులను నిర్లక్ష్యం చేశారని ఆగ్రహించిన సీసీఎల్ఏ ముఖ్య కమిషనర్ సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాటి పత్రులను జిల్లా కలెక్టర్‌తో పాటు తహసీల్దారుకు పంపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లా కేంద్రం వదిలి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు.

# జనసంద్రంలో గణపతి నిమజ్జనం



మట్టెవాడ(వరంగల్): వినాయక చవితి సందర్భంగా ఓరుగల్లు నగరంలో శ్రీభద్రకాళి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 40 అడుగుల మట్టి గణపతి నిమజ్జనం ఆదివారం వేడుకగా జరిగింది. ఉత్సవ సమితి వ్యవస్థాపకులు ఆకుతోట సంజయ్ భారీ మట్టి గణపతిని తయారు చేయించగా.. 15రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించారు. 16వ రోజున ఆదివారం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. శ్రీభద్రకాళి దేవస్థానం ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేసిన తర్వాత నిమజ్జన క్రతువు మొదలు పెట్టారు. నిమజ్జనానికి భక్తుల నుంచి 5 వేల లీటర్ల పాలు సేకరించారు. నిర్వాహకులు 5 వేల లీటర్ల పాలతో పాటు 10 వేల లీటర్ల నీటిని వాడారు. అగ్నిమాపక శాఖ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మరో 10 వేల లీటర్ల నీటిని నిమజ్జనానికి వినియోగించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నిమజ్జనం సాయంత్రం 4.30 వరకు సాగింది. నగరానికి చెందిన సూరజ్ వేలంపాటలో రూ.2,26,116కు లడ్డూ దక్కించుకున్నారు. వచ్చే ఏడాది ఇదే స్థలంలో 45 అడుగుల మట్టి ప్రతిమను ప్రతిష్ఠిస్తామని సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ బడా గణపతిని దర్శించుకోలేని వారి కోసం ఇక్కడే ఏర్పాటుకు తీర్మానించినట్లు ఉత్సవ సమితి నిర్వాహకులు వివరించారు. సుమారు 8 లక్షల మంది భక్తులు విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు.



నిమజ్జనం చేసిన నీరు మొదట పక్కనే ఉన్న కాలువలోకి వెళ్లడంతో పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిమజ్జనం నీటిని డ్రమ్ముల్లో నిల్వ చేశారు. ఈ క్రతువును ప్రత్యక్షంగా చూడటానికి వచ్చిన భక్తులతో ఎల్లంబజార్ ఏరియా జనసంద్రమైంది. అనంతరం విగ్రహం తయారీకి వాడిన మట్టిని భక్తులకు పంపిణీ చేశారు.